# ధర్మపత్ని



"ఎవరే యింట్లో..." తలుపు పగిలిపోయేటంత గట్టిగా దబదబా బాదుతూ శివరావు పొలికేకపెట్టాడు.

"వస్తున్నానండీ .." వణికి పోతున్న కంఠ ధ్వని యింటిలోనుంచి వచ్చింది.

"ఎవరండీ యింట్లో" శివరావుతోపాటుగా వచ్చిన శశి గోముగా అడిగింది. శశివైపు తిరిగి సూటిగా మాటలాడటానికి సంశయించాడు అతను. నోరు తెరిస్తే దొంగసారాయి వాసన గప్పుమని పైకివచ్చే టట్లుంది. తలుపును ఇంకా దబదబా బాదుతూ "పనిమనిషి శశీ ..." అన్నాడు.

శశి అంతకి మించి వేరే ప్రశ్నించదలచుకోలేదు. అయినా ఆరోజు యిల్లూ వాకిలీ చూసిపోదామని వచ్చిందిగాని, యింట్లో పనిమనిషితో పరిచయం చేసుకుందామనికాదు. నిర్లక్ష్యంగా తెరవని తలుపు వంక చూసింది. శివరావు తలుపుగొళ్లెం చప్పుడుచేస్తూనే వున్నాడు.

"పాలు పొంగిపోతుంటే దింపేటప్పటికి ఆలస్యమయిందండి" తలుపుతీస్తూనే సుమతి తడబడలాడుతూ గొణిగింది.

'కొంపకొచ్చేటప్పటికి నువ్వు నవ్వుతూ ఏడ్చింది ఒక్కరోజు తగలడింది కనక...ఎప్పుడూ దరిద్రపు ముఖమూ నువ్వూనూ...'శివరావు తెరుచుకుంటున్న తలుపును దభేలుమని లోపలకు తోసుకొనివెళ్ళాడు. శశి సుమతి ముఖారవిందాన్ని పరీక్షిస్తూ వయ్యారంగా గదిలోకి అడుగు పెట్టింది.

సుమతి తెల్లబోయింది శశిని చూడగానే. తనింటిదగ్గర చూడటం ఇదే మొదటిసారయినా అదివరకు అనేకసార్లు పెద్దబజార్లోనూ, కూరల మార్కెట్టువగ్గర చూసింది. ఇప్పుడు పోల్చుకునే స్థితిలోలేదు.

మెల్లిగా అడుగులువేసుకుంటూ వంటింట్లోకిపోయి వేడినీళ్ళచెంబు తీసుకునివచ్చి వాకిట్లో అరుగుమీదపెట్టింది. దండెంమీద ఆరవేసిన తువ్వాలు మాగవెన్నెలలో తెల్లగా కనపడుతోంది.

"కాళ్ళు కడుక్కోండి....అన్నం పడ్డిస్తాను...." సుమతి మెల్లిగా గదిలోకివస్తూ అడిగింది.శివరావు గుడ్లురిమాడు వాకిట్లోకి గబగబావస్తూ.

సుమతి అతని వెంటనే నడిచింది. చేతులమీదా నీళ్ళుపోస్తూ అతి మెల్లగా 'ఆమె ఎవరండీ' అంది.

'కళ్ళు కనపడటంలా' అంటూ గదమాయిద్దామనుకుంది గాని, శశి ఎందుకనో చాలా మందహాసంతో సమాధానం చెప్పేసింది శివరావు నోటివెంట మాటరాక మునుపే 'కాబోయే అమ్మగారినని'.ఆమాటఅంటూ శశి సిగ్గు అభినయించింది కూడా.

'ఆ' అంటూ చెంబువదిలేసింది సుమతి. కాలిమీద వీళ్ళతో చెంబు పడగానే శివరావుకు గంగవెఱ్ఱు లెత్తినట్లయింది.

'ఫో.... పాడుముండా అని...,నేను యింటికివచ్చేటప్పటికి మీ వాళ్ళింటికిపోయి కూలబడిమని చెప్పానా....నువ్వు చెప్పగానే ఎందుకు వింటావు....' కిందపడి పోయిన చెంబు తీసి బలంగా కొట్టాడు సుమతి వీపుమీద. నెప్పిని లోపల దిగమింగుతూ గబగబా వాకిలివైపు అడుగులు వేసిందిసుమతి.

'ఇంత పొగరుమోతు పనిమనిషిని ఎలావుంచుకున్నారండి మార్చి పారెయ్యక... ఈ అలికీ జనాన్ని సగం మాడ్చివుంచాలిగాని' శశి విసుగ్గా బయటకువచ్చి పమిట విదుల్చుకుంటూ లోపలకు పోయింది.

'నన్నెక్కడకు పొమ్మంటారు మిమ్మల్ని విడిచి' అంటూ సుమతి నోటిలోనుంచి అతి నీరసంగా వచ్చినమాటలు గదిగుమ్మందాకానేరాలేదు. శివరావు తలుపు గడియవేసి గొణుక్కుంటూ లోపలకుపోయాడు.

సుమతి నడుంపట్టుకుని బలవంతంగా అరుగుమీదకు చేరింది. వకళ్ళమీద ఆధారపడాల్సిన జీవితాలు అంతేగదా అనుకుంది. గడిచిన జీవితపు గాథలు భయంకరంగా కనురెప్పలోపల కనపడుతున్నాయి.

పెళ్ళిరోజు.... తనకిష్టంలేకపోయినా అయిన సంబంధం అని తన్ని పోషిస్తున్న తనబంధువే తన కొడుకుతో ముడిపెట్టడానికి ఖాయం చేశాడు. "పెద్దలచే నిశ్చయింపబడినదిగాన" అంటూ శుభలేఖలోవున్న అక్షరాలు చదువుతుంటే 'తనకిష్టంలేని పెళ్ళిని ఈపెద్దలు నిశ్చయించ

టానికి ఏం అధికారంవుంది?" అంటూ ప్రశ్నించుకుని ఎవరినీ అడగ టానికి ధైర్యం చాలక కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. అప్పుడే ధైర్యం చేసినా తనజీవితం సవ్యంగా సాగిపోయేదేమో?

మంగళసూత్రం కట్టడానికి వస్తున్నప్పుడు కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.... "ఈతాగుబోతు తన మెడకు పురితాడు బిగిస్తున్నాడే" అనే చింత మనోవ్యాకులతతో, చనిపోయిన తల్లి బ్రతికుండగా చెప్పిన మాటలు జ్ఞప్తికివచ్చినాయి "శుభకార్యం జరుగుతున్నప్పుడు కంటనీరు పెట్టగూడదని." ఇది శుభకార్యం అవునాకాదా అని మనసులో సంశ యంగానే వుంది.

ఈనాడు....?ఆనాడు వూహించిన భీభత్స దృశ్యాలన్నీ ఒక్కొ క్కటీ దాపురిస్తున్నాయి. మనసిచ్చి మాటాడకపోయినా తన జీవితంలో సుఖవంతంగా గడపిన దినం వక్కటిగూడా లేదనే చెప్పాలి వివాహం అయిన తర్వాత.

సుమతి ఆలాపనగా అరుగుమీదవున్న స్తంభానికి చేరగిలబడి వేసి వున్న తలుపువైపు చూస్తోంది. తలుపు సందుల్లోనుంచి దీపం వెలగటం ఆరిపోవటం అనేకసార్లు జరగటం చూసింది.మనసులో ఉవ్వెత్తుగాపొర్లు కొస్తున్న దుఃఖం కంటివెంబడి వూరికే కారిపోతుంది.

"మీ పనిమనిషిని మార్చివేయండి... తలతిరుగుడు మనిషిలాగా వుంది..." శశి అంటున్న మాటలు అస్పష్టంగా వినబడగానే "నేను పని మనిషినిగాను" అంటూ బిగ్గరగా అరుద్దామనుకుంది. అదీ తన వునికికే హానికలిగించవచ్చుననే భయం కొద్దీ నోరు నొక్కుకుని వూరుకుంది.

"ఏమండీ....మాట్లాడరేం..."

"ఏంకావాలి శశీ......"

"హృదయం ఇచ్చి వివాహం చేసుకుంటానన్నారు...అంతకంటే ఏంకావాలి..."

"అది సరే శశీ .... ఏదో అడుగుదామనుకుంటూ మానేశావు యిప్పుడు ..."

"అటూ యిటూ మీకూ నాకూ గూడా ఎవరూ లేనప్పుడు...మనం యిక్కడ టాకీగా వివాహం అంటూ ఏర్పాటుచేసి..."

"డప్పు కొట్టుకుంటేనేగాని పెళ్ళి అయినట్లుగాదా ... ఏమిటి నీవెర్రిగాని... పెళ్ళి అంటే నలుగురూ నాలుగు అర్థాలు తీస్తారు...అది గాకపోయినా శాస్త్రయుక్తంగా చేసుకుంటే పెళ్ళిగాని దండలువేసుకుంటే పెళ్ళి కానట్లా!"

"పోనీ అట్లాగే చేద్దాం... నా జీతంలో మిగిల్చినడబ్బు కొద్దిగా, మీరిచ్చిన డబ్బు బోలెడెంతావుందిగా..."

"మొత్తానికి నీవాదస్త్రం పోలేదన్నమాట"

"పొండీ..."

సుమతి బయటి వరండాలో అరుగుమీద కళ్ళు, చెవులూ మూసు కుని వినకూడదనుకుంటూనే సంభాషణఅంతా వింది.కాసేపు వరండాలో అటూ ఇటూ తిరిగింది. రోడ్డుమీద జనసంచారం ఏమీ లేకపోవటం వలన కొద్దిగా ధైర్యంచేసి రోడ్డు చివరదాకా పోయివచ్చింది. నిద్ర ముంచుకువస్తోంది. అరుగుమీద అటు ఇటూ కాసేపు దొర్లి కలవరిస్తూ నిద్రపోయింది.

పక్కవాళ్ళింట్లో బుట్టకిందనుంచి కోడి కొక్కొరొకో అంటూ బిగ్గరగా అరిచింది. దానికి అప్పుడే ఎందుకనో మెళకువ వచ్చినట్టుంది. అప్పటికి సరిగ్గా రెండుగంటలైంది. అప్పుడే పార్కులో గడియారం గంటలు కొట్టింది. ఆవలిస్తూ లేద్దామా వద్దా అనుకుంటూ ఉండగానే గది తలుపులు తెరుచుకున్నాయి.

చంద్రాస్తమానం అయిపోవడంవలన శివరావు సుమతిని గుర్తు పట్టలేకపోయాడు. శశి కూడా గుర్తుపట్టలేక పోయింది. శశి ఆ మసు గునుచూచి భయపడి కెవ్వనకేకవేసి శివరావును గట్టిగాకౌగలించుకొంది.

సుమతి ఆలికిడికి గబుక్కునలేచి నిలబడి 'నేనేనండి....' అంది వంచినతల ఎత్తకుండానే.

'పాడుదానా నువ్వేటే...ఇంకా ఎవరో అనుకొని హడలిపో యాను...'శశి ఆడసింహంలా మీదకురికి ఫెళ్ళుమని చెంపమీద కొట్టింది. సుమతికి నిద్రమత్తు జాగా వదిలిపోయింది. శివరావు కంగారుపడిపో యాడు. శశి తొందరపడి చెయ్యిచేసుకొంటుందని అతనెన్నడూ అను

కోలేదు. శశి నవ్వుతూ చాలా గొప్పపని చేసినిదానిలాగా శివరావు వంక చూసింది.

'పొమ్మంటే యిక్కడే అఘోరించావే... శివరావు దూరంగానే వుండి పళ్లు పటపటలాడించాడు.

'యింత తలతిక్క మనిషిని ఎక్కడా చూడలేదు. కట్టుకున్న పెళ్ళాంలాగా కొంప వదిలిపెట్టకుండా ఇదేం పీడని ... పంపించెయ్యరాదుటండీ మళ్లీ యీ కొంపలో అడుగుపెట్టద్దని చెప్పి' శశి తాపీగా కుడి కాలి బొటనవేలు నేలమీద రాస్తూఅంది.

సుమతి అభిమానం బాగా దెబ్బతిన్నట్లయింది. ఎడంచేత్తో చెంపని పట్టుకుని నడుం గోడకి ఆనించి 'నేనేం పనిమనిషినిగాదు...పెద్దలంతా చేరి ఈయనకు చేసిన ధర్మపత్నిని'' అంది.

శశి నల్లబారిపోయి, మబ్బులు కమ్మిన చంద్ర బింబంలాగా అయింది. శివరావు ధూంధాంలాడుతూ గబగబ గదిలోకి నడవబోయాడు.

శశి అతని చొక్కాను గట్టిగా పట్టుకుని ఏదో మాట్లాడబోయి ఆయాస పడుతూ వక్కగుంజు గుంజింది. శివరావు వులిక్కిపడి వెనుక్కి పరిగాడు.

''ఒకరి జీవితాన్ని నాశనంచేసింది కాక నాజీవితాన్నిగూడా పాడు చేస్తావురా...'' మూరులోనుంచి చీపురుకట్ట తీసి పెడేలుమని శివరావు ముఖంమీద కొట్టింది. సుమతి పరుగెత్తుకుంటూవచ్చి చీపురు కట్ట లాగి అవతల పారేసి ''నా ఎదుట నాభర్తను కొడతావా? సిగ్గులేదూ...యిందాక నన్నవమానంచేస్తే వూరుకున్నా గాని ఆయన్ని ఏమన్నా అన్నా వంటేనా...'' అంటూ శశిమీద విరుచుకుపడింది.

శశి మరింత తెల్లబోయింది. శివరావు మాట్లాడలేదు. శశి గొంతు మరింత పెద్దదిచేసి 'నిన్నేం చేస్తానో చూడు. రేపు ఆఫీసులో నిన్ను అవమానం పాలుచేసి నీ వుద్యోగం వూడతీయించకపోతే చూడు...' హుంకరిస్తూ వాకిట్లోకి బయలుదేరింది.

సుమతి ఆమె పాదాలమీదపడి 'భర్త అవమానంపాలై వుద్యోగం

లేక అలమటిస్తుంటే ఏ స్త్రీ అయినా సహిస్తుందా చెల్లీ...నన్ను క్షమించి కరుణిస్తానని మాట యిస్తేగాని నీపాదాలు వదలను'అంది. తన తలంతా నీటి చుక్కలతో తడిసిపోగానే సుమతి కళ్లెత్తి పైకి చూసింది. శశి కళ్లు 'లే అక్కా' అంటున్నాయి. శశి సుమతిలో కలిసిపోయింది. శివరావు విడిగా నిలబడి పోయాడు.

★